1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

శనివారం | జనవరి 20, 2024 | www.navatelangana.com

షార్ట్ సర్క్యూట్‌తో పాన్‌షాప్ దగ్ధం



- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం వద్ద జన్నపాల వెంకటయ్య పాన్ షాప్ శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్తో దగ్ధమైంది. షాపులో ఉన్న సుమారు మూడు లక్షల విలువ చేసే సామాగ్రి కాలిపోయిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు ఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు.. అనంతరం షాప్ యజమానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట 16వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, కిరణ్ ఉన్నారు.

మిషన్ భగీరథ నీటినిలుపుదలపై కమిషనర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-చండూరు

స్థానిక హైదరాబాదు రోడ్డులో ఉన్న పైపులైను రోడ్డు మరమ్మతు కార్యక్రమాల్లో భాగంగా మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోవడం జరిగింది దాని గురించి మున్సిపల్ సిబ్బంది మరో వైపు రోడ్ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం వల్ల గడిచిన ఐదు నెలల నుండి స్థానిక 10 వ వార్డులోని సాగర్ నీళ్ల రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న, ఎన్నిసార్లు మౌఖికంగా ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో పదో వార్డు ప్రజలు రాతపూర్వకంగా శుక్రవారం చండూరు మున్సిపల్ కమిషనర్ మణికరణ్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డుకు సంబంధించిన శిరం శెట్టి శ్రీధర్ బాబు,రామగిరి సర్వేష్, ఆచారి సంకోజు సోంబ్రహ్మం, సంకోజు భాస్కర్, తాడిశెట్టి బిక్షమయ్య, సంకోజ్ బిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది'కి ప్రత్యేక ప్రణాళిక..!

వంద శాతం ఉత్తీర్ణత కోసం తపన.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ. విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టులాంటిది. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతే. పదిలో మంచి ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట పడుతోంది. విద్యార్థుల జీవితంలో విలువైన పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంటే అనుకున్నంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యను అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉన్నత స్థాయి ఫలితాలను సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు.



నవతెలంగాణ-నల్లగొండ టౌన్

నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి కావడంతో.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 229 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 20వేల 357 మంది విద్యార్థులు ఈ సారి పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. దీని కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సాయంత్రం 4.45 గంటల నుంచి 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఎక్కువ మార్కులు వచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్స్ ఎలా రాయాలో ప్రిపేర్ చేయిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో సునాయాసంగా టెస్టులు రాయటమే కాకుండా మొదటి స్లిప్ టెస్టు కంటే ఆపై నిర్వహించే స్లిప్ టెస్టుల్లో ప్రగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. స్లిప్ టెస్టుల ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలపై, ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, లఘు తరహా ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగే విధంగా ముందుకు సాగుతున్నారు.

స్నాక్స్ ఎప్పుడు...?

పదో తరగతి విద్యార్థులకు జనవరి రెండో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక క్లాస్ నిర్వహిస్తున్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకం చాలాచోట్ల అమలు కావడం లేదు. మధ్యాహ్నం భోజనం తర్వాత సాయంత్రం ప్రత్యేక క్లాసులో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలితో టీచర్ చెప్పే క్లాసులు సరిగ్గా వినడం లేదు. కొన్నిచోట్ల దాతలు ముందుకు వచ్చి స్నాక్స్ అందిస్తున్నారు. సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న వారికి ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేసి స్నాక్స్ అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: బొల్లారం బిక్షపతి డిఇఓ (నల్లగొండ)



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాము. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులు 10/10 గ్రేడ్ సాధించేలా కృషి చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాము.

మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు: ఎన్ నిర్మల్ రెడ్డి (హెడ్మాస్టర్ జేబీఎస్ స్కూల్-మాధవనగర్ నల్గొండ)

డిసెంబరు చివరి వరకు సిలబస్ పూర్తి చేశాం. జనవరి 2వ తేదీ నుంచి ప్రత్యేక క్లాసులు ప్రారంభించాము. మెరుగైన ఫలితాల సాధన కోసం ఉదయం, సాయంత్రం వేళలో గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. గత విద్యాసంవత్సరం ప్రైవేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించాము ఈ సారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాము.

అర్థమయ్యేలా చెబుతున్నారు: టీ మానికేశ్వరి (పదవ తరగతి-జేబీఎస్ స్కూల్ నల్లగొండ)



సార్లు ఇంగ్లీష్, మ్యాస్, సైన్స్ సిలబస్ లు ఒకటికి రెండు సార్లు చెబుతున్నారు. బోర్డుపై లెక్కలు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహిస్తున్నారు. మ్యాథ్స్‌తో పాటు ఇంగ్లీష్, సైన్స్ బాగా అర్థమవుతుంది. 10/10 గ్రేడ్ సాధించేలా కష్టపడుతున్నాను.

సార్లు బాగా చెబుతున్నారు: ఆలా కౌశిక్ పదవ తరగతి (జేబీఎస్ స్కూల్ నల్లగొండ)



మ్యాథ్స్, ఇంగ్లీష్, సైన్స్ టీచర్లు బాగ చెబుతున్నారు. అర్థం కాకుంటే ఒకటికి రెండు సార్లు బోధిస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు పెట్టి మార్కులు తక్కువగా వస్తే.. అదే సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించేలా చెబుతున్నారు. వంద శాతం మార్కులు వస్తాయనే నమ్మకం కలుగుతుంది.



దళిత బంధును వెంటనే ప్రారంభించాలి

- తక్షణమే గ్రౌండింగ్‌ను చేపట్టాలి
- దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అధికారులు పేదరిక రేఖకు దిగువన ఉన్న దళితులను దళిత బంధు పథకం కింద ఎంపిక చేయడం జరిగిందని ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలనే డిమాండ్ తో శుక్రవారం శాలిగౌరారం మండలానికి సంబంధించి దళిత బందుకు ఎంపికైన 270 మంది దళిత బందు బాధితులతో నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేషజాలకు పోకుండా, పార్టీల మధ్యన ఉన్న వైశ్యమాలను పక్కకు పెట్టి దళిత బందుకు ఎంపిక కాబడిన లబ్దిదారులకు గ్రౌండింగ్ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ వల్ల యధావిధిగా సాగాల్సిన గ్రౌండింగ్ ప్రక్రియ ఆగిపోయిదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసి నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దళిత బంధు నిధులను విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించని యెడల దళిత, బహుజన, సామాజిక ప్రజా సంఘాలను కలుపుకొని దళిత బంధు బాధితుల ఉద్యమాన్ని రాష్ట్రస్థాయి ఉద్యమంగా మలుచుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామిడి రమేష్,ఏర్పుల నరెంధర్, పోతే పాక నవీన్, బడుపుల శంకర్, మామిడి యాకూబ్, అద్దంకి రవీందర్, రాచకొండ గణేష్, మాచర్ల వెంకట్, ఈర్ల కిరణ్, దేగాల ఏలీష, మాగి రవి, పులిగిల్ల శంకర్, పనికర కమలాకర్, గుండ్లపల్లి రవి,బందేల ఉదయ,తోటకూరి వంశీ, నక్క నరేష్,రావీ దావీదు, ఆంజనేయులు, దేవరకొండ శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, సైదులు, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.



నేడు, రేపు ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ఓటరు నమోదుకు నేడు, రేపు(20, 21న) స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమము జిల్లా వ్యాప్తముగా నిర్వహించడం జరుగుతున్నదనీ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. శుక్రవారం హైదరాబాదు నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి ఓటర్ నమోదు, పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కానివారు ఓటరు జాబితాలో పేరు నమోదుకు, చిరునామా తదితర సవరణల గూర్చి జిల్లాలో రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారం (6, 8)లతో రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటారని, ఓటర్ నమోదుకు, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పు, సవరణలు ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరములు నిండిన యువతి, యువకులు సద్వినియోగము చేసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జే. శ్రీనివాస్, ఆర్డీవోలు రవి, శ్రీరాములు, దామోదర్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

భారత గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడాపోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, దీప్తి, సౌందర్య, శ్రీ వాణి, బార్ అసోసియేషన్ కార్యదర్శి జె రవి, సభ్యులు లాల్ బహదూర్, ప్రవీణ్, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, శంకరయ్య, ప్రమీల పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆర్డీవో రవి



నవతెలంగాణ-నల్గొండ టౌన్

నల్గొండ పురపాలక సంఘం ఇంచార్జి కమిషనర్‌గా నల్లగొండ ఆర్డీవో రవి శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మునిసిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట కౌన్సిలర్లు ఖయ్యూమ్ బేగ్, భాస్కర్ గౌడ్, వేణు గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్ ఉన్నారు.

వారంపాటు జాతీయ బాలికల దినోత్సవాలు

నవతెలంగాణ-నల్గొండకలెక్టరేట్

జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా గాంధీ, గురుకుల పాఠశాలల్లో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాలను వారం రోజులపాటు నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ పిడి కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలకు వ్యాసరచన, ఉపన్యాస, పోటీల తో పాటు సంతక సేకరణ, ప్రతిజ్ఞ, గ్రామసభలు, వాల్ పోస్టర్లు, ఆటల పోటీలు, అదేవిధంగా బాలికల ఆరోగ్యం, పోషక ఆహార మీద అవగాహన, మొక్కలు నాటడం, బేటి బచావో- బేటి పడావో తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా కలెక్టరేట్ లోని ఉదయాదిత్య భవనంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

నర్సింగ్ ఉద్యోగ అభ్యర్థులకు ఆహ్వానం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ టామ్ కామ్ ఆధ్వర్యంలో జపాన్, జర్మనీ దేశాలలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్ పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్, ఏఎన్ఎం, డిప్లమా హోల్డర్లు జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు నెలకు రూ.1.5 నుండి 1.8 లక్షల వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా జర్మనీలో నర్సింగ్ అప్రెంటిస్షిప్ ప్రోగ్రామ్ కోసం 18 నుండి 28 సంవత్సరాల వయసు కలిగి ఉండి ఇంటర్మీడియట్లో 60 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జర్మనీలో విజయవంతమైన ప్లేస్‌మెంట్‌పై అభ్యర్థులకు శిక్షణ సమయంలో నెలకు రూ.1లక్ష స్కాలర్షిప్ చెల్లిస్తారని, ఉద్యోగ నియామకం అనంతరం నెలకు రూ.3 లక్షల జీతం ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను tomcom.germany@gmail.comకు మెయిల్ చేయవచ్చు లేదా 9573945684 ను సంప్రదించవలన్నారు.

కాంగ్రెస్‌కు చుక్కెదురు.. వీగిన అవిశ్వాసం



- సభ్యులు హాజరుకాక అవిశ్వాసం రద్దు!

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్)చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాణం వీగిపోయింది. అవిశ్వాస తీర్మాణానికి సభ్యులు హాజరు కావాలని జిల్లా అధికారులు ఇచ్చిన నోటీసుల ఆధారంగా శుక్రవారం అవిశ్వాస తీర్మాణ సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు అధికారులు వేచి చూసినా సభ్యులు రాలేదు. ఇచ్చిన సమయం గడువు పూర్తి కావడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్ ప్రకటించారు. కాగా ఈ సొసైటీలో 13 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 9 మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని గత ఏడాది డిసెంబర్ 20న జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబర్ 28న అవిశ్వాస తీర్మాణానికి 18 జనవరి 2024 హాజరు కావాలని 13మంది సభ్యులకు నోటీసులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మాణ సమావేశానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేయగా జిల్లా అధికారి అనారోగ్య కారణాల రిత్యా ఒకరోజు వాయిదా వేశారు. శుక్రవారం అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టేందుకు సమావేశం నిర్వహించగా సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా అధికారి ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయా సొసైటీలకు, మున్సిపాలిటీలకు అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ కోణంలోనే నల్లగొండ మున్సిపాలిటీ, వెలిమనేడు పీఏసీఎస్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో మిర్యాలగూడలోని తడకమళ్ల పీఏసీఎస్‌కు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టగా కాంగ్రెస్ తన పంతాను నెగ్గించుకోలేక అబాసుపాలయింది. దీంతో అధికార కాంగ్రెస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 50 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించగా క్లస్టర్ అధికారి రాంబాయి, ఆఫీస్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీనియర్ ఇన్స్‌పెక్టర్ నారాయణస్వామి, జూనియర్ అసిస్టెంట్ సుబాన్, సీఈవో నర్సయ్యలు పాల్గొన్నారు.

కొండమ్మ మృతి పట్ల సంతాపం



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు చెందిన చెవుగోని కొండమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మండలంలోని చందుపట్ల గ్రామపంచాయతీ పరిధిలోగల కందిమల్ల వారి గూడెంకు చెందిన వెంకయ్య వీరమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారికి నివాళులర్పించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి నార్కట్‌పల్లి అద్దంకి రహదారి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన చిక్కుల రమేష్ (33) నల్లగొండ నుంచి నార్కట్‌పల్లికి వస్తుండగా రహదారిపై వేగంగా వస్తున్న కంటైనర్ లారీ ఒక్కసారిగా స్లో చేయడంతో ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

- ఫిబ్రవరి 16న సెక్టోరియల్ సమ్మె- గ్రామీణ బంద్
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలు, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక మైత్రి దినోత్సవం సందర్భంగా జిల్లా సదస్సు కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్న రైతులు కార్మికుల సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాలేదని ఆరోపించారు. భారతదేశ వెలిగిపోతుంది, అచ్చేదిన్ ఆగయా ఆత్మ నిర్భయ భారత్, మేకింగ్ ఇండియా అనే మోసపూరిత నినాదాలు ఇవ్వడం తప్ప జరిగిందేమీ లేదని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అవినీతి నల్లధనాన్ని తెచ్చి ప్రజలకు 15 లక్షల రూపాయలు అకౌంట్ లో వేస్తామని మాటలు నీటి మూటలు గానే మిగిలాయని అన్నారు. భారతదేశంలోని సహజ వనరులన్నీ కార్పొరేట్ శక్తుల పరం చేస్తుందన్నారు. యోహాత్మకంగా ప్రభుత్వ రంగ సంస్థలలో వందశాతం అమ్మకాల పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను నాలుగు కోట్లుగా విభజించి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని ఆరోపించారు. 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తుంది కాంట్రాక్టు విధానం తీసుకువచ్చి కార్మికులను మరింత దోపిడీకి కనీస వేతనం 26000 ఇవ్వడానికి ముందుకు రావడంలేదని ఆరోపించారు. కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి నారి ఐలయ్య, కున్ రెడ్డి నాగిరెడ్డి లు మాట్లాడుతూ ఫిబ్రవరి 16 దేశవ్యాప్తంగా సెక్టోరియల్ సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం కోసం దశలవారీగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనవరి 20 నుండి ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ట్రాక్టర్ బైక్ ర్యాలీలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఫిబ్రవరి 16 సమ్మె సందర్భంగా కరపత్రాలు, ప్రజలతో సంతకాల సేకరణ గ్రామ మండల స్థాయిలో రైతులు వ్యవసాయ కార్మికులు కార్మికులతో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు బొజ్జ చిన్న వెంకులుల అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, రైతు మహిళా జిల్లా కన్వీనర్ కందాల ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు డబ్బీకార్ మల్లేష్, బండా శ్రీశైలం, కంబాలపల్లి ఆనంద్, ఎండి సలీం, దండంపల్లి సత్తయ్య, తిరుపతి, రామ్మూర్తి, మల్లు గౌతంరెడ్డి, జిట్టా నగేష్, నల్ల వెంకటయ్య, రాగిరెడ్డి, మంగారెడ్డి, రొండి శీను పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తరించాలి

- 5వేల నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే బిఎల్ఆర్‌కు అందజేస్తాం: కర్నాటి రమేష్
- వర్షిత హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటుచేసి లయన్స్ క్లబ్ సేవలు అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని "వర్షిత" సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ కూటాల రాంబాబుల నేతృత్వంలో ఏర్పాటుచేసిన మేగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు



వచ్చి పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కర్నాటి రమేష్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవలను అందిస్తామని, ఐదువేల నోటు పుస్తకాలను అందజేస్తామని ప్రకటించారు. మరింత ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. వర్షిత హాస్పిటల్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చైర్మన్ కూటాల రాంబాబు తెలిపారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ మలక్ పేట్ చెందిన ప్రముఖ డాక్టర్లు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రమాకాంత్ రెడ్డి, మూత్రపిండాల వైద్య నిపుణుడు డాక్టర్ అమన్ చంద్రపాండే, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎల్. రోహిత్ రెడ్డి,డాక్టర్ నివాళికలు మేగా వైద్య శిబిరంలో హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కే ఎస్ ప్రసాద్, మాజీ జోనల్ చైర్మన్లు ముక్కా పాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ జాడీ రాజు, రవీందర్ రెడ్డి, లైన్స్ క్లబ్ కార్యదర్శి లింగయ్య అనంత రెడ్డి, కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ సిజెఎస్ఎస్ దివ్యాంగ చైతన్య అధ్యక్షులు కోల సైదులు ముదిరాజ్, బి. ఎం. నాయుడు, లైన్స్ క్లబ్ తరుణ కార్యదర్శి సామా శ్రీనివాస్, గుండా రాంబాబు, ఏచూరి మురారి, భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు మేకల శ్రీనివాస్ రావు, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, కౌన్సిలర్లు జానీ, జావిద్, రుణాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్, లయన్స్ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
2
శనివారం | జనవరి 20. 2023 | www.navatelangana.com

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గరిడేపల్లి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నవ తెలంగాణ 2024 న్యూ ఇయర్ క్యాలెండర్‌ను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ,ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, సమస్యలను పరిష్కరించడంలో తమ వంతు బాధ్యతను జర్నలిస్టులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్‌కె. యాకుబ్, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై పి.వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీఓ వనజ, ఆర్ఐ సంపత్,జాన్‌ఖాన్, సత్యనారాయణ, ఏపీఓ సురేష్, కొండ సైదులుగౌడ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

సూర్యాపేట మండలపరిధిలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రూరల్ ఎస్సై ఆర్.సాయిరాం నవతెలంగాణ 2024 న్యూఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.అనుదినం జనస్వరం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నసమగ్ర తెలుగు దినపత్రిక నవతెలంగాణ అన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, సామాన్య ప్రజల కష్టనష్టాలను, సమస్యలను, ఎప్పటికప్పుడు తెలుసుకొని, ప్రశ్నించే గొంతుకల, ప్రజల పక్షాన నిలబడే పత్రిక నవతెలంగాణ అన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తమ వంతు బాధ్యతను జర్నలిస్టులు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్మికులు, కర్షకులను ఐక్యం చేద్దాం

- కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం
- రైతుసంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



కార్మిక,కర్షక వర్గం ఐక్యమై కేంద్రంలో బీజేపీని గద్దెదించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్ లో సీఐటీయూ,తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక, కర్షక ఐక్యత జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాల వలన అవలంబిస్తున్న కార్పోరేటు మతోన్మాద విధానాల మూలంగా దేశంలోని కార్మిక వర్గం రైతాంగం పేద ప్రజలందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా కుదించడం జరిగిందని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు.అదేవిధంగా రైతులకు ఉరితాడు బిగించే విధంగా తీసుకొచ్చిన 3 రైతు వ్యతిరేక నల్లచట్టాలను దేశంలోని రైతాంగం పోరాటం ద్వారా వెనక్కు తీసుకున్నట్టే తీసుకొని మళ్లీ వాటి అమలకు ప్రయత్నం కొనసాగిస్తుందని విమర్శించారు.రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేస్తుందన్నారు.గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను తగ్గించి వ్యవసాయ కార్మికులను మోసం చేస్తుందన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తయినా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతూ పేదలపై భారాలు మోపుతుందని విమర్శించారు.అనేక ఏండ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేటు కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టిందన్నారు.ఒకవైపు కార్మిక రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అవలంబిస్తూ మరోవైపు ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో చిచ్చు పెడుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని ఓడించడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, రైతుసంఘాలు, వ్యవసాయకార్మికసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, మోటార్ సైకిల్, ఆటోల ర్యాలీ, ఫిబ్రవరి 16 న దేశవ్యాప్త సమ్మె , గ్రామీణ బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక,కర్షక ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మిరైతు సంఘం జిల్లా నాయకురాలు కొప్పుల రజిత,మేదరమెట్ల వెంకటేశ్వరరావు,పల్లె వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ,మందడి రాంరెడ్డి, కందాల శంకర్‌రెడ్డి, గుమ్మడవెల్లి ఉప్పలయ్య,పులుసు సత్యం,సిరికొండ శ్రీను,పోషణ బోయిన హుస్సేన్, గుంజ వెంకటేశ్వర్లు, సోమపంగ జానయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు వట్టెపు సైదులు, మిట్టగనుపుల ముత్యాలు, వల్లపుదాసు సాయికుమార్,బచ్చలకూర స్వరాజ్యం, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటమితో బానిస సంకెళ్ల నుంచి విముక్తి

- కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనసన్మానం
- కొత్తగూడెంఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కోదాడరూరల్

బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణ రాష్ట్రానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభించిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం



పట్టణంలోని కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు నివాసానికి వచ్చిన సందర్భంగా కాకతీయ సేవా సమితి సభ్యులు, సీపీఐ నాయకులు ఆయకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఆశలతో, ఆశయాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకొని సమస్యలు పరిష్కారమవుతాయనుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిర్బంధాలు, మాట్లాడే స్వేచ్ఛ లేకపోవడం, సమ్మెలు, ఉద్యమాలు చేసినవారిని అణగదొక్కడంతో బీఆర్ఎస్ పాలన పై ప్రజలు విసుగు చెందారన్నారు.దీంతో119 నియోజకవర్గాల్లో సీపీఐ ప్రభావంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలి పోయిందని ఉద్యోగాలు ఇవ్వాలన్నా, కొత్త పథకాలు ప్రారంభించాలన్న చాలా సవాళ్లతో కూడుకున్నదని తెలిపారు.కొత్త ప్రభుత్వం నిజాయితీతో, నిబద్ధతతో ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తినేని హను మంతరావు, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, రావెళ్ల, సీతా రామయ్య, ముత్తవరపు పాండురంగారావు, వేమూరి సురేష్,పోటు రంగారావు, సిపిఐ నాయకులు పోతురాజు సత్యనారాయణ, మాతంగి ప్రసాద్, కోటేశ్వరరావు, శ్రీను,మురళి పాల్గొన్నారు.



ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి పోషనబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు.శుక్రవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో శుక్రవారం సీపీఐ(ఎం) గ్రామశాఖ సమావేశం వెగ్రెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ పోరాటం నిర్వహించిందన్నారు.అనేక గ్రామాలల్లో రోడ్లు,డ్రయినేజీలు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు.బూరుగడ్డలో ప్రభుత్వ భూమిని పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని, సీతారామాపురంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేసి అర్హులైన పేదలందరికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి మాదూరి నర్సింహాచారి,మండల కమిటీ సభ్యులు తంగెళ్ల వెంకటచంద్ర, నూకల లక్ష్మీనర్సమ్మ, శాఖ సభ్యులు శాఖమూరి శేషగిరిరావు, తంగేళ్ల గోపరాజు, వెంగల్‌రెడ్డి, మట్టారెడ్డి, పారుపల్లి పూర్ణావతి, పారుపల్లి శ్రీను, కుక్కడపు స్వామి, బిందు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలి'

నవతెలంగాణ-కోదాడరూరల్

బేగంబజార్ డివిజన్‌లో విధుల్లో ఉన్నలైన్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి జరిగిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోటగిరి వెంకటనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు.ప్రభుత్వ ఉద్యోగిపై జరిగిన దాడిని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.ఈ విషయంపై ఎస్‌పీడీసీఎల్ విజిలెన్స్ డిపార్ట్మెంట్, సీఎండీ వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.డ్యూటీలో ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం అనేది చాలా తీవ్రమైనటువంటి చర్య అన్నారు.సౌత్ సర్కిల్ ఎస్ఈ, బేగంబజార్ డీఈలు వెంటనే కేసులు పెట్టి అరెస్టు చేయించాలని కోరారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఈ కార్యాలయాల ముందు ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు.ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు మిట్టగనపుల ముత్యాలు, తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తలూరు నాగేశ్వరావు ఉన్నారు.

భువనగిరి ఎంపీ టికెట్ బీసీలకే కేటాయించాలి

నవతెలంగాణ-నూతనకల్

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్ల పార్లమెంట్‌ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టిక్కెట్‌ను బీఆర్ఎస్ గతంలో బీసీలకే కేటాయించినట్లు మూడవసారి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు దూదిమెట్ల బాలరాజుకు కేటాయించాలని బీఆర్ఎస్ బీసీ విభాగం జిల్లా జటంగి సతీష్‌యాదవ్ కోరారు శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన బీసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఎస్సీ,ఎస్టీ జనాభా ఉందన్నారు.బాలరాజు సతీమణి ఎస్సీ సామాజిక వర్గానికి చెందింది కావడంతో బీసీ సామాజిక వర్గం ఓట్లతో పాటు ఎస్సీ సామాజిక వర్గం ఓట్ల మద్దతుతో గేలిసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఉప్పుల వీరుయాదవ్,ఎల్లావుల పరమేశ్, భూతం ప్రశాంత్, చౌగోని సతీష్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పశుసంచార వైద్యసేవలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రైతులకు గ్రామీణ ప్రాంతంలో పశు యజమానులకు అందుబాటులో పశు సంచార వైద్య సేవలు ఉంటాయని జీవికేఈఎంఆర్ఐ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భగీష్ మిశ్రా ప్రోగ్రామ్ మేనేజర్ నజీరిద్దీన్ ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ సోమేశ్వర్ అన్నారు శుక్రవారం పట్టణంలో 1962వ వాహన సంచార పశు సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిధిలో నాలుగు 1962 వైద్య సంచార వాహనాలు సంచరిస్తున్నాయని తెలిపారు.హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకొని పశు సంపదను పెంచాలన్నారు.జిల్లాలో అందుతున్న పశు వైద్య సేవలను అడిగి తెలుసుకుని



సంతృప్తి వ్యక్తం చేశారు.ఇంకా వైద్య సేవలు గ్రామీణ ప్రాంతంలో విస్తృతంగా అందే విధంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంచార వైద్యశాల సిబ్బంది డాక్టర్ ప్రశాంత్, నజీర్,నగేష్,గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ చైర్మెన్

నవతెలంగాణ-నూతనకల్

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును మండలకేంద్రానికి చెందిన పీఏసీఎస్ చైర్మెన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యలను గురించి వివరించి వారి సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మండల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు.



'రైతులు సంఘటితశక్తి పెంచుకోవచ్చు'

నవతెలంగాణ-మోతె

రైతులు రైతు ఉత్పత్తిదారులసంఘంలో వాటాదనం చెల్లించి సభ్యులుగా చేరడం వల్ల సంఘటితశక్తి పెంచుకోవచ్చని వ్యవసాయ ఉత్పత్తిదారుల శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ పేర్కొన్నారు.శుక్రవారం మండలపరిధిలోని నామవరం రైతు వేదికలు వ్యవసాయ ఉత్పత్తిదారుల శాఖ స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సంఘం ఏర్పాటు ఆవశ్యకత,అంశాలపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు రైతుల సంఘం ఏర్పాటు చేయడం వలన రైతుల పొందే ప్రయోజనాల గురించి వివరించారు.ఉపకారణాలు ఉమ్మడిగా తప్పించుకోవటంద్వారా సాగు ఖర్చును తగ్గించుకొని అధికాదాయ పొందవచ్చున్నారు.నూతన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ఉమ్మడిగా శిక్షణను తీసుకోవచ్చు అన్నారు పంటలను ఉత్పత్తి చేసే సమయంలో సలహాలను ఇచ్చి పుచ్చుకోవడం వల్ల అధిక ఉత్పత్తిని పొందవచ్చని తెలిపారు.సభ్యులు పండించిన పంటలను సేకరించి క్లీనింగ్ గ్రేడింగ్ చేసి ఉమ్మడిగా విక్రయించడం వల్ల పంటకు అధికధర పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనాధికారి జగన్,ఏఈఓ ప్రియాంక, రైతులు కీసర విజయపాల్‌రెడ్డి,రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి,కట్టవెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక కార్యక్రమం

నవతెలంగాణ-అర్వపల్లి

జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అతి త్వరలో జగనన్న పంచాయతీ ఎన్నికలలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని,అందుకు అవకాశం కల్పించిందన్నారు.అదేవిధంగా 20,21వతేదీల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు పోలింగ్‌కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరుజాబితాలో చిరునామా తదితర సవరణలపై గురించి మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని సూచించారు.అందుగాను శనివారం ఆదివారం ఓటరునమోదు కార్యక్రమం పై గ్రామాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఎమ్మెల్సీగా బల్మూరి వెంకట్ నియామకం పట్ల హర్షం

నవతెలంగాణ-మద్దిరాల



ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్‌ను అభ్యర్థిగా ఎంపిక పట్ల ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుజ ఎల్లేష్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంపై విద్యార్థి, ప్రజాసమస్యలపై ఆయన చేసిన పోరాటలకుగాను పార్టీ గుర్తించిందన్నారు.బల్మూరి వెంకట్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ అధిష్టానం,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-చివ్వెంల



మండలంలోని వల్లభాపురం గ్రామంలో డీసీసీ ప్రధాన కార్యాదర్శి మోగదాల లక్ష్మణ్‌గౌడ్, గ్రామ సర్పంచ్ జీడిమెట్ల నాగలక్ష్మి లక్ష్మయ్య కాంగ్రెస్ అధ్యక్షులు కుంభంధర్మయ్య, బానోత్‌వెంకట్, చెవులప్రకాశం, షేక్‌అజ్జు, యాట నరహరి, కుంభం సతీష్, శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన బానోత్ మురళి, బానోత్ నగేష్, బానోత్ బలరాం, ధరావత్ కురువ బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు.కాంగ్రెస్‌లో చేరగా లక్ష్మణ్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-మఠంపల్లి



మండలంలోని యాతవాకిళ్లలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం సర్పంచ్ కోలాహలం లక్ష్మీ నర్సింహారాజు,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీసర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో షేక్‌మస్తాన్, కేశబోయిన వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రాజు, షేక్ సైదా,హుస్సేన్, కాటా లింగరాజు, కొత్తూరు వెంకన్నకురి కాశయ్య,గొట్టం ప్రకాష్, పులిలచ్చయ్య వెంకటేశ్వర్లు, నాగ యాదవ్, బైరినాగయ్య,కుక్కల సైదులు, పాతకోటి నాగులు బైరినరేష్ తదితరులు పాల్గొన్నారు.

'చెరువులు, కుంటల్లో పూడిక తీయించాలి'

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్



హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని చెరువులు, కుంటలలో పూర్తిస్థాయిలో పూడిక తీయించి రానున్న వేసవిలో సాగర్ నీటితో నింపాలని పట్టణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు శీలం శ్రీను కోరారు.శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు వెయ్యి కుటుంబాలు మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నా యన్నారు.పట్టణంలోని ఊరచెరువును అభివృద్ధి చేస్తూ గత ప్రభుత్వం చేపట్టిన ట్యాంక్ బండ్ నిర్మాణపనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరామన్నారు.ఆయన వెంట ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చింతకాయల రాము, నాయకులు వెంకన్న,మల్లయ్య ,సీతారాములు, నర్సయ్య,గోపయ్య ఉన్నారు.

స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-కోదాడరూరల్



అయోధ్యలో శ్రీరాముడి ప్రతిష్ఠ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్విఘ్నంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు దాతలు కోదాడ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం మంత్రిప్రగడ శ్రీధర్ స్కూల్ విద్యార్థుల సౌజన్యంతో ముఖ్యఅతిథి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు నాగుబండి రంగా, అధ్యక్షులు గాదంశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి ఇరుకుళ్ల చెన్న కేశవరావు, జాయింట్ సెక్రెటరీ కాటేపల్లి నర్సింహారావు, జాయింట్ సెక్రెటరీ యాద శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ యాద సుధాకర్, ట్రస్టు సభ్యులు పుల్లఖండం సాంబశివరావు, గుడుగుంట్ల సాయి, పైడిమర్రిరామారావు, వెంపటి ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మునగాల



మండలంలోని ముకుందాపురం గ్రామవాసి దేవరం నర్సిరెడ్డికి పందిరి ఫౌండేషన్ శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేసింది.బాధితుడు నర్సిరెడ్డి తన నివాసంలో డాబా మీద నుండి ప్రమాద వశాత్తు కాలు జారి కింద పడిపోయాడు.దీంతో ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో అచేతనస్థితిలో ఉన్నారు.విషయం తెలుకున్న పందిరి ఫౌండేషన్ బాధిత కుటుంబానికి సహాయం అందించింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో నియోజక వర్గ స్థాయిలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వ హిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మిడి సతీష్‌బాబు, గౌరవ సలహాదారు ఎస్ఎస్.రావు, గ్రామ సర్పంచ్ పందిరి కళావతి, వార్డు సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, సైదులు, రాంపంగు సైదులు, నాతల వెంకటరెడ్డి, రేణబోతు శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేపడతామన్న, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి కట్టుబడి ఉండాలని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాల ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు..గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతామని నేటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, ఆ మేరకు సత్వరమే కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 56 శాతం పదవులు కేటాయించాలని, కోదాడ మార్కెట్ చైర్మెన్ పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ప్రకటన విడుదల చేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం నాయకుడు చిలకరాజు శ్రీను, తదితరులు ఉన్నారు.

'అద్దంకి దయాకర్‌పై కక్ష సాధింపు చర్యలు తగదు'

నవతెలంగాణ-తిరుమలగిరి

కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా నిలబడి, పార్టీని నిలబెట్టిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌పై కక్ష సాధింపు చర్యలు తగదని తిరుమలగిరి మున్సిపాలిటీ మాల మహానాడు అధ్యక్షులు గంట లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం అసెంబ్లీ టికెట్‌ను త్యాగం చేసిన ఆయన, ఇప్పుడు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీను కూడా కోల్పోవడం బాధాకరమన్నారు. నామినేషన్ దాఖలు వేయడానికి ముందు గంటల వ్యవధిలో జరిగిన ఆకస్మిక నిర్ణయం వెనుక ఎవరున్నారని, కారణాలేంటని, ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. నామినేషన్ వేయడానికి అవసరమైన అఫిడవిట్ సహా అన్ని పత్రాలు రెడీ చేసుకోవాలని ఏఐసీసీ నుంచి సమాచారం వచ్చిన చివరి నిమిషంలో ఎందుకు ఇలా నిర్ణయం తీసుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంట సందీప్, కార్యదర్శి పెరుమాళ్ళ వరుణ్‌కుమార్, గంట సంపత్, గంట ఉదయ్ పాల్గొన్నారు.



ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ- కోదాడరూరల్

18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో సూర్యనారాయణ కోరుతూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.నియోజకవర్గ ప్రజలకు ఓటరుగా నమోదు చేసుకొనుటకు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈనెల 20, 21వ తేదీలలో సమీపంలోని బీఎల్ఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా 01-11-2020 నాటికీ గ్రాడ్యుయేట్ పట్టా పొందిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకొనుటకు చివరి తేదీ 06-02-2024 అని తెలిపారు.



పాశం భాస్కర్‌కు సన్మానం

నవతెలంగాణ-భువనగిరి

బీజేపీ జిల్లా అధ్యక్షులునిగా ఎన్నికైన పాశం భాస్కర్‌ను నల్గొండలోని ఎమ్మెల్సీ సనహాయిక సమావేశంలో చింతల రామచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాసాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండల పరిధిలోని వెలువర్తి గ్రామానికి చెందిన బూడిద నరసింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ప్రముఖ పారిశ్రామికవేత్త వెలిమినేటి జంగారెడ్డి ఏజేఆర్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చిన రూ.5వేలు శుక్రవారం ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజెఆర్ ఫౌండేషన్ సభ్యులు, మృతుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ హనుమంతు కే జెండగే

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే ఆదేశించారు. శుక్రవారం కాన్ఫరెన్స్ హాలులో వచ్చే జనవరి 26 న గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించే ఏర్పాట్లను ఆయన జిల్లా అధికారులతో సమీక్షిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై ప్రసంగ పాఠం తయారు చేయాలని, వేదిక, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను, జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉద్యోగుల ప్రశంసా పత్రాల



బహుకరణ సంబంధించి నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలను పంపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ భాస్కరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి వీరా రెడ్డి, పోలీస్ అసిస్టెంట్ కమీషనర్ వెంకట రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, జగన్నాథ రావు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శని, ఆదివారాలలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా రేపు 20 వ తేదీ శనివారం, 21వ తేదీ ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రాజాపేట

విద్యుద్ఘాతంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని రఘునాథపురం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రఘునాథపురం గ్రామానికి చెందిన దేవనపల్లి సిద్ధులు చంద్రకళ దంపతుల కుమార్తె పుట్టనిర్మల తన భర్త గోపితో కలిసి హైదరాబాదులో నివాసముంటూ జీవనం కొనసాగిస్తున్నారు. నిర్మల గోపి దంపతులకు ఇద్దరు అమ్మాయిలు జన్మించగా మూడవ కాన్పు కోసం తన తల్లి గారి ఇంటికి రఘునాథపురానికి వచ్చింది. శుక్రవారం ఉదయం నిర్మల రెండో కూతురు ఇంటి దాబా పైకి ఎక్కగా దాబా పైనుండి కింద పడిపోతుందనే ఆందోళనతో నిర్మల ఆమె తల్లి చంద్రకళలు దాబా పైకి వెళ్లి కిందకు దింపే ప్రయత్నంలో పైన ఉన్న 11 కెవి విద్యుత్తు లైను వైరు సమీపంలో వెళ్లగా వారిద్దరూ విద్యుద్ఘాతానికి గురయ్యారు. దీంతో నిర్మల కు, ఆమె తల్లి చంద్రకళకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే వారిని భువనగిరి ఆసుపత్రికి తరలించారు. నిర్మల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని విద్యుత్తు ఏఈ చంద్రశేఖర్ సిబ్బంది పరిశీలించారు. ఎస్సై సుధాకర్ రెడ్డి పోలీసు బృందంతో వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. నెల రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు 11 కేవీ లైన్ ను గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పరిశీలించారు. గృహాల నిర్మాణాలు పెరిగిపోవడంతో అట్టి 11 కేవీ లైను ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు అక్కడి ఏరియా ప్రజలు సహకరిస్తే వెంటనే లెవెన్ కె.వి లైన్ ను మార్చనున్నట్లు హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు బిక్షమయ్యగౌడ్ పరామర్శ



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలోని 4వవార్డులో గంధమల్ల కిష్టయ్యగౌడ్, 12వ వార్డు ఆలేటి అరుణ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను శుక్రవారంమాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్ పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ చింతలపూడి వెంకటరామిరెడ్డి , గౌడ సంఘం అధ్యక్షులు గనగాని శంకర్ గౌడ్, కౌన్సిలర్ బేతి రాములు , పార్టీ నాయకులు జూకంటి చిన్న ఉప్పలయ్య, జూకంటి పెద్ద ఉప్పలయ్య, వార్డు అధ్యక్షులు సీస సత్తయ్య గౌడ్, ఆలేటి బాలకిషన్ , కూతాటి అంజన్ కుమార్, ఎండి ఫయాజ్, ఆలేటి అనిల్ ,ఆలేటి అజయ్, చిమ్మి శివమల్లు, ఆలేటి అరుణ, గనగాని నరసింహులు, మొరిగాటి బాలరాజు ,మొరిగాడి రాము గౌడ్, పులిపలుపుల శంకరయ్య గౌడ్, మొరిగాడి వెంకటేష్, దూడల చంద్రమౌళి గౌడ్, గనగాని మల్లేష్ గౌడ్ , సీస ప్రభాకర్ ,గనగాని కిష్టయ్య గౌడ్, కటకం బాలరాజ్ ఉన్నారు.

విద్యార్థి జేఏసీ నాయకుడు జెల్లా శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ మృతి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు అమ్మ ఒడి ఆశ్రమం నిర్వాహకుడు జెల్లా శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ శుక్రవారం ప్రకటనలో కోరారు. సహచర ఉద్యమకారుడు తెలంగాణ కోసం హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై అనేక దిగ్బంధాలు చేసి తెలంగాణ వచ్చిన తర్వాత యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో అమ్మ అనాథాశ్రమాన్ని నెలకొల్పి దిక్కుతోచని అభాగ్యుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేశాడని పేర్కొన్నారు. . స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తెలంగాణ అమరవీరుల కోటాలో జెల్లా శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సబ్బండవర్గాల అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

సబ్బండవర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని మాసాయిపేట గ్రామపంచాయతీ మూడవ వార్డు నెంబర్ కళ్లెం విజయ జహంగీర్ గౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట శుక్రవారం, గ్రామంలోని మసీదులో ఉర్దూ పాఠశాల నిర్మాణం కోసం రూ.25 వేలు యాదగిరిగుట్ట మండల వైస్ ఎంపీపీ ననబోలు ప్రసన్న శ్రీనివాస్ రెడ్డి, రూ.15 వేలు గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యులు కళ్లెం విజయ జహంగీర్ గౌడ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ ఎండి యాకూబ్, కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షులు యాకూబ్ అలీ, వార్డు మెంబర్లు సుంచు వినోద్ కుమార్, ఎండి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు



పవన్ మోటార్స్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి బైపాస్ రోడ్డు లో ఏర్పాటు చేసిన పవన్ మోటార్స్ మారుతీ షోరూం ను ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వాణిజ్య రంగం లో ముందుకు రావాలని, భువనగిరి ప్రజలకు మారుతీ షోరూం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పవన్ చంద్ర రెడ్డి పాల్గొన్నారు.



ఏన్‌డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి 4వవార్డులో మోత్కూర్ కు వెళ్లే రోడ్డు పక్కన ఏ ఎస్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువు అయిపోగానే, చదువుతూనే దేశ రక్షణ కోసం ఈ యొక్క ట్రైనింగ్ ను తీసుకోవడం శుభ పరిణామమన్నారు డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు మొగిలిపాక అశోక్ కుమార్, నవీన్ కుమార్ లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, వలిగొండ ఎంపీపీ నూతి రమేష్ రాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోతన ప్రమోద్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఇరపాక నరసింహ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్, భువనగిరి మండల సర్పంచులు ఎదునూరి ప్రేమలత మల్లేశం, ఎల్లంల శాలిని జంగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు, కరపత్రంను శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలను మైనారిటీ విద్యార్థులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ గంద్ర శ్రీకాంత్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శేక్. హమీద్ పాష గారు, వార్డెన్ షానూర్ బాబా, వేదప్రకాష్, రహమత్ అలీ, మైనారిటీ నాయకులు మజర్, అబేద్‌అలీ, తంగళ్లపల్లి రవికుమార్, పోత్నక్ ప్రమోద్ కుమార్, పొతంశెట్టి వెంకటేశ్వర్లు,బిస్కుంట్ల సత్యనారాయణ, దేవరకొండ నర్సింహచారి, చిక్కుల వెంకటేష్, చిన్న, పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా గీత

నవతెలంగాణ-భువనగిరిరూరల్

మున్నూరు కాపు సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా భువనగిరికి చెందిన సాదినేని గీత ఎన్నికయ్యారు. ఈ మేరకు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు నియామక పత్రం అందజేశారు.. తాడెం రమేష్ యాదాద్రిభువనగిరి జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాధినేని గీత మాట్లాడుతూ తనకు అధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షులు మణికొండ రమేష్,కోశాధికారి లింగిశెట్టి హన్మంతు రావు, పలువురు ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-వలిగొండరూరల్

గ్రామంలో కుంటుపడిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూమండలంలోని వెంకటాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త వెంకటేశం, రవీందర్ రెడ్డి, శ్రీశైలం, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలోని జామా మసీదు ఆవరణంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.అనంతరం క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎండి జైనుద్దీన్, ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి బాబా, ఎండీ గౌస్ ,ఎండి షబ్బీర్ ,ఎండి ఖలీల్, ఎండి సర్వర్ , ఎండి ముస్తఫా తది తరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణమండపంలో తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్327 (ఐఎన్‌టియుసీ) నూతన క్యాలెండర్, డైరీని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి విరాళం అందజేత

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండల పరిధిలోని పులిగిల్ల గ్రామాభివృద్ధికి అదే గ్రామానికి చెందిన కళ్లెం సుదర్శన్ రెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ జక్క వెంకట్ రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఊరు పై మమకారంతో గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు ఎల్లయ్య, ఉపసర్పంచ్ పైళ్ల రవీందర్ రెడ్డి, వడ్డేమాన్ మహేందర్, వేముల అమరేందర్, నక్కల సందీప్ రెడ్డి, మారబోయిన రాజు, మెరుగు నాగలక్ష్మి, బుగ్గ వెంకటేశం, వాకిటి వెంకటరెడ్డి, పంచాయితీ కార్యదర్శి బూడిద పావని, పైళ్ల గణపతి రెడ్డి, బొబ్బల కృష్ణారెడ్డి, ఆలేటి కొండల్, జక్కిడి చంద్రారెడ్డి, బుగ్గ శ్రీనివాస్ రెడ్డి, కాసాని జనార్ధన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మ దేవాలయం దర్శించుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి



నవతెలంగాణ-రాజపేట

యాదగిరిగుట్ట మండలం కాచారం (కైలాస పురం) లోని శ్రీ వాసవి రేణుకా, బసవ లింగేశ్వర దేవాలయాలను శుక్రవారం రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగం కోశాధికారి, ఆర్యవైశ్య నాయకురాలు, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వ సుజాత మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆర్యవైశ్యుడిగా ఉండడం చాలా ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు లెంకలపల్లి శ్రీనివాస్, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను ప్రారంభించాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా చౌడబోయిన పరశురాములు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పుడున్న పరిస్థితులలో ఉపాధి పనిని ప్రారంభించాలని, జాబు కారుర్డలేని వాళ్లకు జాబ్ కార్డు ఇవ్వాలని ,నిత్యావసరదరులకు అనుకూలంగా కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి చౌడబోయిన కనకయ్య ,శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి ,పోతు ప్రవీణ్, గొట్టిపాముల శ్రీనివాసరావు, పేరపు రాములు తదితరులు పాల్గొన్నారు.

స్టీరింగ్ పైనే లారీ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-రామన్నపేట

లారీ స్టీరింగ్ పైన డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం... భువనగిరి నుండి చిట్యాల వైపుకు లోడుతో వెళుతున్న లారీ డ్రైవర్ వెల్లంకి వీరభద్రరావు(51) సుభాష్ సెంటర్ సమీపంలోని ఒక హోటల్ దగ్గర ఆగి కొన్ని మంచి నీరు తాగి తిరిగి లారీ ఎక్కాడు. అంతలోని గుండెపోటుతో స్టీరింగ్ పైనే కుప్పకూలి మృతి చెందారు. లారీ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామవాసిగా గుర్తించారు. స్టీరింగ్ పైనే డ్రైవర్ మృతి చెందడంతో పట్టణానికి చెందిన పలువురు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

నవతెలంగాణ-రామన్నపేట

భారత ప్రభుత్వం దేశ ప్రజల కోసం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన, నరసన్న భీమా కుటుంబానికి ధీమా, వికసిత్ భారత్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ యోజన



రాష్ట్ర కన్వీనర్, భువనగిరి పార్లమెం ట్ కన్వీనర్ బంగా రపు లింగస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కన్నె కంటి వెంకటేశ్వర చారి, దంతూరి సత్తయ్య, మండల అధ్యక్షులు తాటిపాముల శివకృష్ణ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మైల నరసింహ, కో-కన్వీనర్ మాడూరి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జాల గ్రామ సర్పంచి గుంటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజపేట మండలం జాల గ్రామంలో సంకల్ప వికాస్ భారత్ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంధముల నరసింహులు వార్డు సభ్యులు గ్రామంలోని పెద్దలు యువకులు రైతులు 150 మంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పాత పద్ధతిలో కొనసాగాలి

నవతెలంగాణ-వలిగొండరూరల్



పాతపద్ధతిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించాలని మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఈతాప రాములు కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ఎమ్మార్వోలే పెత్తనం చేసేవారని కానీ రైతులు ఎవరు నేరుగా ఎమ్మార్వో ఆఫీస్ కు వెళ్లలేక పోయారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిని కొనసాగించడం చాలా సంతోషకరమన్నారు. పట్టా భూములు పోరంబోకు భూములు సీలింగ్ భూముల మీద వీఆర్వోలకి అవగాహన ఉంటుందన్నారు.

నూతన భవనాల ప్రారంభోత్సవ ఆహ్వానం

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు శుక్రవారం, నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మహిళా సంఘ భవనం, గ్రంథాలయం, బీసీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మినిస్టర్ డి అనసూయ అలియాస్ సీతక్క ను పెద్ద కందుకూరు గ్రామ సర్పంచ్ భీమగాని రాములు గౌడ్, గ్రామపంచాయతీ కార్యవర్గం ఆహ్వానించారు. రెండు మూడు రోజుల్లో వస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల్నే వెంకటేష్, నమిలే నరేష్, సీపీఐ(ఎం) కార్యదర్శి కాల్నే స్వామి, మాజీ సర్పంచ్ భీమగాని మాధవి రాములు గౌడ్, కాల్నే రాజు, సయ్యద్ చోటా మియా తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శనివారం | జనవరి 20. 2024 | www.navatelangana.com



వినోద రైస్ మిల్లును తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి శివారులోని వినోద రైస్ మిల్లును శుక్రవారం జిల్లా అదనపు కలెక్టరు ఏ.భాస్కరరావు శుక్రవారం తనిఖీ చేశారు. సీఎంఆర్ పనులను పరిశీలించారు. మిల్లర్లకు నిర్దేశించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

శ్రీనివాసపురంలో ఉచిత వైద్య శిబిరం




నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో సర్పంచ్ వడ్ల నవ్య శోభన్ బాబు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ వారి సహకారంతో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులు మహిళలు పురుషులు 150 మంది వైద్య పరీక్షలు చేసుకొని ఉచితంగా మందులు తీసుకున్నట్లు సర్పంచ్ నవ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికార పార్టీవైపు..బీఆర్ఎస్ నేతల చూపు

- ఇప్పటికే తెలిసిన వారితో పైరవీలు
- ఓడగొట్టేందుకు ప్రయత్నించిన నేతలు నాకు అవసరం లేదంటున్న బీర్ల ఐలయ్య
- అయిష్టంగానే కొందరికి కండువాలు కప్పాల్సి వస్తుందని సన్నిహితులతో చెబుతున్న వైనం



నవతెలంగాణ -యాదగిరిగుట్ట

అధికారం దర్పం ప్రదర్శించిన కొంతమంది నాయకులు కనీసం పార్టీ మీద ప్రేమ లేకుండా వ్యవహరిస్తూ ప్రస్తుత అధికార పార్టీలో చేరేందుకు శత విధాల ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుండే ఈ ప్రయత్నాలు మొదలు పెట్టడం విశేషం.ఆలేరు నియోజక వర్గంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గేట్లు తెరిస్తే చాలు అన్నట్టుగా ప్రతిపక్ష నాయకులు ఉన్నట్టు వినికిడి.

తెలిసిన వారితో పైరవీలు

నియోజక వర్గంలో ఎన్నికల ముందు పార్టీ మారిన నాయకులకులతో పాటు ,పాత కాంగ్రెస్ నాయకులతో పరిచయం ఉన్న వారిని బీఆర్ఎస్ నాయకులు సంప్రదిస్తున్నట్లు తెలిసింది. అందులో కొంతమంది ఎంఎల్ఏ బీర్ల ఐలయ్యకు విషయం చెబుతున్న మరికొంతమంది ఆ నాయకులు వస్తే మాకు ఇబ్బంది అవుతుందని భావించి ఆయన దృష్టికి తీసుకెళ్లడంలేదని తెలుస్తోంది.ఏదేమైనా నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం బయటపార్టీ నాయకులు ప్రస్తుతం అవసరమా అని చర్చించుకుంటున్నారు.

ఓడగొట్టేందుకు ప్రయత్నించినవారు అవసరమా అనుకుంటున్న బీర్ల

ఎన్నికలముందు పార్టీలోకి రావాలని కోరినా పట్టించుకోకుండా తన ఓటమికి ప్రయత్నించి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్ల పార్టీలోకి రావాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులు నాకు అవసరమా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య భావిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా బీర్ల ఐలయ్య గెలిచిన రాష్టంలో కాంగ్రెస్ రాదని ప్రచారం చేసిన వ్యక్తులు పార్టీ అధికారంలోకి రావడం తో ఇటు వైపు చూస్తున్నారని ప్రచారం జరుగుతుంది.

అయిష్టంగానే కండువాలు కప్పుతున్నారని ప్రచారం

తాను ఎన్నికల్లో గెలిచిన నాటి నుండి కొంతమంది కాంగ్రెస్ నుండి ఏన్నికల ముందే బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.. ఇవన్నీ కూడా ఆయనకు ఇష్టం లేకున్నా స్థానిక పరిస్థితుల దృష్ట్యా చేసినట్టు తెలుస్తోంది. రాజకీయ చట్రం లో ఎవరిని ఎలా దారిలోకి తెచ్చుకోవాలో తెలిసిన ఆయన ప్రస్తుతం మాత్రం తన గెలుపునకు అహర్నిషలు కష్టపడ్డ వారికి ఎలా న్యాయం చేయాలో ఆలోచిస్తున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాంగ్రెస్ లో కి ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో క్షణం పట్టదని తెలిసినా రాజకీయ ఎత్తుగడలు అవసరం అయినప్పుడే ఆయన తన సత్త చూపిస్తాడని ఆయన అభిమానులు చెప్పుకుంటున్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ హరిచందన దాసరి



నవతెలంగాణ-నల్గొండ టౌన్

గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాలు, పథకాల అమలు గురించి ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్లు చెన్నారెడ్డి, లలిత, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాపారావు, వంశీ కృష్ణ, లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కకూ నీరందించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు



నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

మొక్కలను నాటడం కాదని, వాటిని సంరక్షణ కూడా అందరి బాధ్యత అని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. వాటరింగ్ డే సందర్భంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో 33 వార్డులో హరితహారం మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటరింగ్‌డేలో పాల్గొనాలని పేర్కొన్నారు.ప్రతి నాటిన ప్రతిమొక్కకు నీరు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రామాలలో పట్టణాలలో గ్రీన్‌బడ్జెట్ నుండి నిధులను ఉపయోగించుకోవాలన్నారు.నాటిన మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీల నుండి పొంగిపొర్లుతున్న మురుగునీరు



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీ పరిధిలోని గౌతమ్ బాలవిహార్ నుంచి గవర్నమెంట్ కాలేజీకి వెళ్లే దారిలో జిమ్ సెంటర్ పక్కన డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. గతంలో వేసిన అంతర్గత సీసీ రోడ్లనిర్మాణ సమయంలో మ్యాన్ హోల్స్ మీద మూతలు పగిలిపోవడం వల్ల రాళ్లు, చెత్తచెదారం పడి డ్రైనేజీలైన్ బ్లాక్ అయి మురుగు నీరు పొంగిపొర్లుతూ దుర్వాసనను వేదజల్లుతుంది. పైలాన్‌కాలనీ గాంధీబజార్ వెనుకభాగంలో డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. దీని కారణంగా దుర్వాసనను వేదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు నడిచే రోడ్డుపైకి పక్కనే ఉన్న డ్రెయినేజీ అనేక రోజులగా పొంగి పొర్లి నిత్యం 7,8 వార్డులోని మెయిన్ రోడ్డు అంతా నిండిపోతున్నది. ఈ మురికి నీటిని తొక్కుకుంటూ నడవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలోనూ ఇదే సమస్యలతో అనేకసార్లు అధికారులకు,ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న నామమాత్రపు పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే గాని శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి బడిపిల్లలు వెళ్తుంటారని విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజి లైన్ క్లియర్ చేసి మ్యాన్ హెూల్ మీద మూతలు వేయవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

దొంగతనాల నియంత్రణ చర్యలపై ప్రత్యేక బృందాలు

- సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత ఎంతో ముఖ్యం
- అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ చందనా దీప్తి



నవతెలంగాణ-నల్గొండటౌన్

జిల్లాలో దొంగతనాల నియంత్రణ కొరకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పటు చేసి అన్ని ప్రాంతాలలో నిఘా పెట్టి నియంత్రణ చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ చందన దీప్తి శుక్రవారం తెలిపారు. ప్రజలు వారి ఇంటి పరిసరాల్లో, కాలనీల్లో, షాపులలో సిసిటివి కెమెరాలు అమర్చుకావాలని ఏదైనా సంఘటన జరిగిన వెంటనే సంబంధిత వ్యక్తుల కదలిక పై తగు చర్యలు తీసుకునుటకు వీటి ప్రాముఖ్యత చాలా అవసరం ఉంటుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో కాలనీల్లో, షాపులలో మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జైలు నుండి విడుదల అయిన నిందితుల పైన (జైల్ రీలీజింగ్ మానిటరీ సిస్టమ్) ద్వారా ప్రతీ నేరస్తుని కదలికల పై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

దొంగతనాల నియంత్రణ జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబంధనలు తూ.చ తప్పక పాటించవలెనని తెలిపారు.

-విలువైన వస్తువులు బంగారం మరియు నగదు బ్యాంక్ లాకర్ లో బద్రపరచండి.మీ యొక్క ఇంటి డోర్ కి సెంట్రల్ లాకింగ్ వాడండి.

-సుదూర ప్రాంతాలకు వెళ్లే పట్టణ ,గ్రామంలోని ప్రజలు సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ముందుగానే తెలియజేస్తే అక్కడ పోలీస్ వారు నిఘా ఏర్పాటు చేయవచ్చు.

-ఇంటికి,షాపులు, కాలనీలు,పరిసరాలు, షాపింగ్ మాల్స్ హై క్యాలిటి కెమెరాలు మరియు రాత్రి వేళల్లో కనిపించే విధంగా (నైట్ విజన్) కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

- పనిచేయని సీసీటీవీ కెమెరాలను పునరుద్ధించుకోవాలి.వాటికి సుమారు ఒక నెల పాటు రికార్డ్ ఉండే అయ్యే విధంగా డివిఆర్ లు ఏర్పాటు చేసుకోవాలి.

-ఎవరిపైన అనుమానం ఉన్నఅపరిచిత వ్యక్తులు సమాచారం తెలిసిన సంబంధిత పోలీస్ వారికి వెంటనే తెలియచేయాలి.

- నేరస్థులు దొంగతనం చేయుటకు ఉపయోగించే వస్తువులు అనగా ఇనుప రాడ్లు,స్క్రూ డ్రైవర్ లాంటి ఇతర పరికరాలను దొంగలకు కనపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- యొక్క నివాస స్థలాలు కాలనీలకు దూరంగా ఉన్నట్లయితే తప్పని సరిగా సీసీటివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి మరియు పగలు వేళలో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీస్ వారికి వెంటనే సమాచారం ఇవ్వాలి.

-ఇంటి నుండి ఎక్కువ రోజులు దూరంగా ఉండాల్సి వస్తే మి ఇంటి సమాచారాన్ని ఇరుగు పొరుగు వారి నుండి తెలుసుకోవాలి.

-ఇంటి వద్ద వృద్ధులు,మహిళలు,పిల్లల ఉన్న సమయంలో "లిఅపరిచితులులి" వచ్చి చెప్పే సమాచారం నమ్మకండి.

- కాలనీల వాసులు గస్తీ తిరగడానికి కనీసం 25-40 సంవత్సరాల లోపు తెలివైన, నమ్మకమైన వ్యక్తులను మాత్రమే సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.

-ఎప్పటికప్పుడు పోలీస్ వారికి అనుమానితుల మీద మరియు దొంగతనాలపై సమాచారం అందించి పోలీస్ వారికి సహకరించండి.

- సమీప పోలీస్ స్టేషన్ల యొక్క సేవలను మరియు డయల్ 100ను సద్వినియోగం చేసుకొని దొంగతనాలు నివారణకు సహకరించ గలరు.

ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమం

- హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈనెల 2శనివారం 21 ఆదివారం తేదీల్లో ఓటర్ల నమోదు కొరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు.బూత్ స్థాయి అధికారులు వారి పోలింగ్ కేంద్రాలలో ఉండి ఓటర్ల నమోదు కోసం చేర్పులు మార్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.బీఎల్ఓలపై పర్యవేక్షణ కొరకు సూపర్‌వైజర్లను నియమించామన్నారు.వారు క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చిన దరఖాస్తుల వివరాలు సేకరిస్తారన్నారు.జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్,ఆర్డీఓ, తహసీల్దార్లు బూత్‌స్థాయిలో పర్యటిస్తారన్నారు.జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయుటకు బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు అదేవిధంగా చనిపోయిన ఓటర్ల డబల్ ఓటర్ల వివరాలు నమోదు చేసి అటు తదుపరి వాటిని తొలగిస్తారన్నారు.



మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించాలి

- ఆర్పీ జయలక్ష్మీ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-కోదాడరూరల్

మున్సిపాలిటీ మెప్మా విభాగంలో పనిచేసే ఆర్పీల సమస్యలను కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర మెప్మా ఆర్పీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జాజుల చంద్రకళ అన్నారు.శుక్రవారం పట్టణ మున్సిపాలిటీలో మెప్మాగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన కుదుముల. జయలక్ష్మి కుటుంబానికి తోటి ఆర్పీలు చేదోడుగా నిలిచి అందించిన రూ.లక్ష ఆర్థికసాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం జయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గౌరవవేతనం కాకుండా కనీస వేతనం రూ.18,000 ఇవ్వడంతో పాటు ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత,జీవిత బీమా కల్పించాలని డిమాండ్‌చేశారు.మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నామని తెలిపారు.వేతనం కంటే ఎక్కువ పనిభారం మోస్తున్నామని,కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రేవతి, కార్యదర్శి.భవ్య, కెజ్జమ్మ, గిరిజ,మాధవి, నాగమణి,ధనలక్ష్మి, సుహాసిని, మధురిమ,సాయమ్మ రాణి,అఖిలా,పర్వీన్, నాగేంద్ర, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-పెన్‌పహాడ్

కందిపంటలో సస్యరక్షణ చర్యలపై శుక్రవారం మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో చదువుతున్న చివరి సంవత్సర వ్యవసాయ విద్యార్థులకు కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త డి ఆదర్శ్ వివరించారు.ఈ సందర్భంగా ప్రస్తుతం కందిపూత, కాయలు ఏర్పడే దశలో ఉన్నదని, కందిచేనులో మర్క మచ్చలపురుగు, శనగపచ్చ పురుగు పొగాకు, లద్దెపురుగు, ఈగ ఆశించిందన్నారు.పురుగులు నష్టపరిచే విధానం, ఆశించడం వలన కలిగే లక్షణాలు విద్యార్థులకు నేరుగా చూపించి వాటి నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని తెలిపారు. ఎకరానికి ఒక సోలార్ దీపపు ఎరను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఎకరానికి ఒక లీటరు వేప నూనెతో ఫ్లుబెండమైడ్ 40గ్రా. లేదా నోవల్యూరాన్ 200 మి.లీ లేదా ఇండాక్సకార్బ్ 200 మి.లీ లేదా క్లోరాన్ట్రానిలిప్రోల్ 60 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే ఆ పురుగుల నుండి సమర్థవంతముగా నివారించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అభిరామ్, దినేష్, నితిన్, సందీప్, మహేష్, మురళి, శరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది సంక్షేమ పథకాల ప్రభుత్వం

- ఎమ్మెల్యే మందుల సామేలు

నవతెలంగాణ-తుంగతుర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమపథకాల ప్రభుత్వమని ఎమ్మెల్యే మందులసామేలు అన్నారు.శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 81 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు.త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అదనంగా తులం బంగారం ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు.తమప్రభుత్వం ఏడువేల ఉపాధ్యాయ పోస్టులను ఒకేసారి భర్తీ చేయడానికి నిర్ణయించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తహసీల్దార్ యాదగిరిరెడ్డి,ఎంపీడీవో భీమ్‌సింగ్‌నాయక్,డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, మహమూద్‌అలీ పాల్గొన్నారు.



అవినీతి, అక్రమాలను వెలికి తీయాలి

- మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో అడుగడుగునా నెలకొన్న అవినీతి అక్రమాలను బయటకు తీసి దోషులను కఠినంగా శిక్షించాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో భూసేకరణ, పరిహారం, పనుల కేటాయింపు వంటి వాటిపై అప్పటి ప్రభుత్వంలో ఉన్న అధికార పార్టీ నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసి నాయకులపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వానికి కూడా ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఈనెల 20, 21వ తేదీల్లో 18 సంవత్సరాలు నిండిన వారు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని ఓటర్ కార్డులో చిరునామా మార్పు కూడా చేసుకోవచ్చు అని అందుకోసం బూత్ లెవెల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాలలో రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు స్పెషల్ క్యాంపియన్ ఏర్పాటు చేయడమైనదని శుక్రవారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

24న షార్ట్ ఫిలిం స్కిట్ పోటీలు

నవతెలంగాణ- భువనగిరి

జిల్లా విద్యా శాఖ, జిల్లా బాలల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు ,ఇంటర్మీడియట్ కళాశాలల్లో బాలికల హక్కులు, సంక్షేమం, బాల్య వివాహాల నిషేదం, బాల కార్మిక నిర్మూలన, మానవ అక్రమ రవాణా అంశాలపై చిన్న వీడియో ఫిల్మ్ స్కిట్ ,సమూహ చర్చ కార్యక్రమాలపై పోటీ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు, కార్యదర్శి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె. దశరథ రామయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.నిర్వహనలపై సంస్థ కార్యదర్శి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథ రామయ్య సి. డబ్ల్యూ. సి అధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ రెడ్డి , జీసీడీఓ నిర్మల జ్యోతి, డీసీపీఓ సైదులుతో చర్చించినట్టు పేర్కొన్నారు.

బడిలో మద్యం సీసాలు..!

- వంటగదిని ధ్వసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-నల్గొండ టౌన్

చదువుల తల్లి సరస్వతి కొలువుండే నిలయం పాఠశాల. ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి పాఠశాలే తొలిమెట్టు. అలాంటి విద్యానిలయం సెలవు సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం విద్యార్థులతో, పుస్తకాలతో కళకళలాడే క్లాస్ రూమ్‌లు బార్ లను తలపిస్తున్నాయి. కొంతమంది ప్రబుద్దులు ప్రభుత్వ పాఠశాలలను పాకశాలలుగా మార్చి విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ, అందులోనే బాటిళ్లు వదిలెళ్లడం, బాటిల్స్ పగులకొట్టి గాజు పెంకులు స్కూల్లోనే పడేయడం లాంటి ఉన్మాదపు చర్యలు చూసుంటాం. అవన్నీ ఎక్కడో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో జరిగినవే. కానీ నాగరికులమని గొప్పలు చెప్పుకొని తిరిగే పట్టణాల్లో కూడా అలాంటి సంఘటనలు జరగడం విస్మయానికి గురి చేస్తోంది. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జేబీఎస్ మాధవ నగర్ పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వారం రోజులు క్రితం సంక్రాంతి పర్వదినం సందర్భంగా విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. తిరిగి బుధవారం బడులు ఓపెన్ అయ్యాయి. బుధవారం రాత్రి కొంతమంది మందుబాబులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించారు. ఖాళీ బీరు బాటిళ్లు అక్కడే పడేసి ఎంచక్కా వెళ్లిపోయారు. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. దీనితో పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలు వాటిని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని,అప్పుడే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు మళ్ళీ ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ,పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పవిత్రమైన పాఠశాలాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టి,రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ఆకతాయిల ఆటలు కట్టించాలని కోరుతున్నారు.



వంటగది ధ్వంసం..

మద్యం సేవించిన దుండగులు పాఠశాల ప్రహరీ గోడ దూకి పాఠశాలలో ఉన్న విద్యార్థులకు వన్డే వంటగదిని ధ్వాసం చేశారు. ఆ గదిలో ఉన్న నాలుగు క్వింటాల కట్టెలను తగలబెట్టడంతో వంటగది రూము కిటికీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అండర్ పాస్ బిడ్జి ఏర్పాటుకు సర్వే

నవతెలంగాణ-అర్వపల్లి

మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం గ్రామం శివారు నుండి వెళ్తున్న తానంచర్ల - సిరోంచి జాతీయ రహదారి నుండి వెళ్లే వాహనాల వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నందున అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జాజిరెడ్డిగూడెం గ్రామస్తులు పలుమార్లు అధికారులను కోరారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ డీఈ బాలునాయక్ జాజిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే దారి, కొత్తగూడెం వెళ్లే దారి వద్ద రెండు చోట్ల అండర్‌పాస్ ప్రదేశాన్ని పరిశీలించారు.ఆయన వెంట ఎంపీటీసీ నర్సింగ నాగమ్మ శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శిగ నసీర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

నల్లగొండ, సూర్యాపేట

యాదాద్రిభువనగిరి

శనివారం | జనవరి 20. 2024 | www.navatelangana.com

గ్రామాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

మండలంలోని పాత సూర్యాపేట, నెమ్మికల్, ఆత్మకూర్‌ఎస్ గ్రామ పంచాయతీలను శుక్రవారం సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రియాంక వఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.తనిఖీల్లో భాగంగా పాత సూర్యాపేట, నెమ్మికల్ గ్రామాల్లో జిమ్ సెంటర్‌లను తనిఖీ చేశారు.ఆత్మకూర్‌ఎస్ గ్రామంలో మెట్ల బావిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.పాత సూర్యాపేట,ఆత్మకూర్‌ఎస్ గ్రామాలలో గ్రీన్‌డే లో భాగంగా ప్రతివారం అన్ని మొక్కలకు నీరు పోయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉంటే అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్, ఎంపీఓ సంజీవ, పంచాయతీ రాజ్ ఏఈ బాబురావు, ఏపీఓ ఈశ్వర్, సర్పంచులు అలివేలు, సతీష్, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, హరిక్రిష్ణ,సుధాకర్, మండల నాయకులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.



'టెన్త్'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- స్పెషల్ క్లాసులు నిర్వహించాలి
- కలెక్టర్ ఎస్ వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్



10వ తరగతి పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట మండలంలోని ఇమాంపేటలో గల కేజీబీవీని ఆయన మధ్యాహ్నం సందర్శించారు.కేజీబీవీలలో 10 తరగతి విద్యార్థుల తో ముచ్చటించారు, బోధిస్తున్న విధానాన్ని సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెన్త్ క్లాస్ విద్యార్థులతో స్కూల్ ఆవరణలో విద్యతోపాటుగా ఇతర అంశాలలో వారికి ఉన్న ఆసక్తిని ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ లలో వాటర్ ,టాయిలెట్స్, అన్నిచోట్ల రిపేరు చేసి పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. వీటన్నిటికీ కేజీబీవీ లలోని ఎస్ఓ లకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు .జిల్లాలోని నాలుగు కేజీబీవీ లలో ఆటలలో, నియోజకవర్గాలలోని నాలుగు కేజీబీవీ లలో నాటక రంగాలలో నైపుణ్యత సాధించేందుకు పిఇటిలు,మాస్టర్ లను తాత్కాలిక పద్ధతిలో నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటుగా అన్ని రంగాలలో నైపుణ్యత సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మార్చి14 నుండి జరిగే 10వ తరగతి పరీక్షలకు గాను స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గమనించి వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని స్కూల్ హెచ్ఎంస్ వారిని నిరంతరం గమనిస్తూ బాగా చదివించి ప్రతి రెండు రోజులకు ఒకసారి ప్రత్యేక పరీక్ష నిర్వహించాలన్నారు. 23 మండలాలలో మానిటరింగ్ చేయుటకు మానిటరింగ్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని డీఈఓ అశోక్‌కు సూచించారు.టీమ్స్ మండలంలో పర్యటించినప్పుడు స్పెషల్ ఆఫీసర్స్ తో పాటుగా టీం అధికారులు కూడా పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి స్పెషల్ క్లాసులు జరుగుతున్న తీరును పరిశీలిం చాలన్నారు.కస్తూర్బా మైనార్టీ విద్యార్థులు అరబిక్ టీచర్ కావాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే తాత్కాలిక అరబిక్ టీచర్ నియామకం చేపట్టాలని సంబంధిత అధికారిణి అనితను ఆదేశించారు.కలెక్టర్ విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతోపాటుగా ఇతర అంశాలలో వారి ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాల్లో ముందుండాలనిసూచించారు.బాగాచదివి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎస్ఓ అనిత, కేజీబీవీ సెక్టోరల్ అధికారి వై.రాంబాబు,టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగాల కోసం పుట్టిన కమ్యూనిస్టు పార్టీ

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-చిలుకూరు

త్యాగాల కోసం పుట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని కొత్తగూడెం ఎమ్మెల్యే కోనమనేని సాంబశివరావు అన్నారు.



శుక్రవారం మండలకేంద్రంలోని దొడ్డనర్సయ్య 25వ వర్ధంతిసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఎలాంటి అవకతవకలకు బెదిరిపోవద్దన్నారు.రానున్న రోజులు కమ్యూనిస్టు పార్టీ రోజులని ఎప్పటికీ మర్చిపోవద్దని తెలిపారు.బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో కమ్యూనిస్టులు ఉనికిని కోల్పోయారని ,ఇక కమ్యూనిస్టులకు భవిష్యత్ లేదన్న వారందరికి కొత్తగూడెం నియోజకవర్గంలో కమ్యూనిస్టు అభ్యర్థి గెలుపు వర్తిస్తుందన్నారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్న సమయంలో సీపీఐ(ఎం),ఎంఎల్ పార్టీ అనేక రకాల కమ్యూనిస్టు పార్టీలు తనకు సహాయ సహకారంగా గెలవడానికి కృషి చేశాయని తెలిపారు .కొత్తగూడెంలో ఒక చిన్న పొరపాటు వలన మెజార్టీ తగ్గింది తప్ప లేకపోతే 45 వేల మెజార్టీ వచ్చేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు సర్పంచులు, ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ డైరెక్టర్లు ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి గెలవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆయన్ను సన్మానించారు.కోదాడ ప్రజావైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పల్లా వెంకటరెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, స్వాతంత్ర్య సమరయోధులు దొడ్డ నారాయణ రావు, అందెసత్యం, గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు,చేపూరి కొండలు ఎస్‌కే.సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు,సిరాపోరపు శ్రీను, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



అవిశ్వాసాలు వద్దు.. హామీలను అమలు చేయండి

- రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

అమలుకు నోచుకోని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసాలపై కాకుండా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, ఈ హామీలన్నింటిని నెరవేర్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తే తమ పార్టీ తరుపున సహకారం అందిస్తామన్నారు. తడకమళ్ల ప్రాథమిక సహకార సంఘం గతంలో అప్పుల ఊబిలో కూరుకపోయిందని, ప్రస్తుతం ఉన్న పాలకవర్గం ఛైర్మన్ పాదూరి సంజీవరెడ్డి, వైస్ ఛైర్మన్ వీరేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బి సంఘం లాభాల వైపు పయనిస్తుందన్నారు. కాంగ్రెస్ హామీఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ ఊసే లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక మెజారిటీ ఉన్న మున్సిపాలిటీలు, పీఏసీఎస్‌లలో కౌన్సిలర్లు, డైరెక్టర్లకు ప్రలోభాలకు గురి చేసి అవిశ్వాసం పెట్టి పంతం నెగ్గించుకుంటున్నారని, దీనిలో భాగంగా నల్లగొండ మున్సిపాలిటీ, వెలిమనేడు పీఏసీఎస్‌లను చేజిక్కించుకున్నారని, మిర్యాలగూడ మండలం తడకమళ్ల పీఏసీఎస్‌లో అవిశ్వాసం పెట్టి కాంగ్రెస్ పార్టీ అబాసుపాలైందని ఎద్దేవా చేశారు. సమావేశంలో మిర్యాలగూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మోహన్‌గౌడ్, శేఖర్‌రావు, రవి, నాగయ్య భిక్షం, వెంకటయ్య సోమయ్య ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రతో ప్రజలకు ప్రయోజనం

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

నవతెలంగాణ-పెద్దవూర

కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర భారతదేశంలో ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ దేశప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి మహేంద్ర నాథ్ పాండే అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని పులిచర్ల గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లడుతూ ఈ సంకల్ప యాత్ర గిరిజనులు, ఆదివాసీల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, చర్యలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను రూపొందించబడిందని తెలిపారు.దీనిని నవంబర్ 15వ తేదీన ఆదివాసీ గౌరవ్ దివస్ సందర్భంగా ఏర్పాటు చేసి దేశ ప్రధాని నరేంద్ర మోదీయే జెండా ఊపి ప్రారంభించారన్నారు. మొదట ఈ కార్యక్రమానికి జార?ండ్‌లోని ఖుంటి జిల్లా వేదిక అయిందని ఆతరువాత వివిధ ప్రాంతాలకు విస్తరించేలా షెడ్యూల్‌ను రూపొందించామన్నారు.ఈ యాత్ర దేశంలోని 24రాష్ట్రాల్లోని 68 జిల్లాలతో పాటూ కేంద్రపాలిత ప్రాంతాల్లో సాగుతుందని దేశ వ్యాప్తంగా 8,500 పై చిలుకు గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.గడిచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమాలను గ్రామస్థాయిలో వివరించేందుకు ప్రత్యేకంగా ఐదు ఐసీఈ వ్యాన్లను ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ వ్యాన్లు జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయితీల్లో కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమాలపై ప్రచారాన్ని అందిస్తాయన్నారు.ఇప్పటికే జార?ండ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, నాగాలాండ్, మహారాష్ట్ర, జమ్ముకశ్మీర్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఒడిశా, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోస్తున్నా వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ది చేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన కారణంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో అత్యదికంగా మరుగు దొడ్లు కట్టించామని తెలిపారు.ఏ రాష్ట్రం లో లేని విదంగా ఒక తెలంగాణ లోనే అత్యదికంగా మరుగుదొడ్ల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తే కేసిఆర్ ప్రభుత్వం కాజేసిందని అన్నారు.అయోధ్యలో ఈ నెల 22 న రామమందిరం ప్రంభోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హేమంత్,డి పిఆర్ ఓ శ్రీనివాస్, ఆర్డి ఓ చిన్నయ్య, ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్ రెడ్డి, బీజేపి మాజీ జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీధర్ రెడ్డి, బీజేపి సాగర్ నియోజకవర్గ ఇంచార్జి నివేదిత రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మి ఎంపిఓ విజయకుమారి, ఎంఆర్ ఓ సరోజ, సర్పంచ్ సైదమ్మ, ఎంపిటీసి దేవసాని లక్ష్మి, బీజేపి మాజీ ఉపాధ్యాధ్యక్షులు సుంకి రెడ్డి నారాయణ రెడ్డి, ట్రాన్స్ కొ ఏఈ దాసయ్య పాల్గొన్నారు.



క్రీడా దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-నాగారం

మండలపరిధిలోని ఈటూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 137 మంది విద్యార్థిని విద్యార్థులకు రూ.70వేల విలువ చేసే క్రీడా దుస్తులు టెక్నో డీడ్ ఐటీ ఛైర్మెన్ వంగూరి దామోదర్ శుక్రవారం పంపిణీ చేశారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సాల్వాతో వంగూరి దామోదర్‌ను సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య,సర్పంచ్ పేరాల సరిత యాదగిరి, హెచ్ఎం ప్రభాకర్, ఉపసర్పంచ్ సోమన్న,వెంకట్‌రెడ్డి, వెంకటభిక్షం, పాఠశాల ఛైర్మెన్ యాదగిరి పాల్గొన్నారు.



మతం పేరిట ఓట్లు రాబట్టడమే బీజేపీతత్వం

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-మర్రిగూడ

ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ప్రజల్లో మత పిచ్చిని రెచ్చగొట్టి ఓట్లు రాబట్టడమే బిజెపి నైజం అని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంట సత్యం అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో బుర్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.బిజెపి గత పది సంవత్సరాలలో ప్రజలకు చేసింది శూన్యమని,పైగా రైతు, కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు దాసోహం పాడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలలో మెప్పు పొంది ఓట్లు రాబట్టుకోవడానికే బిజెపి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన జనవరి 22న అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రతీదీ ప్రజలు గమనిస్తున్నారని మతోన్మాద బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఎప్పుడు ప్రజల ఆకాంక్ష మేరకే పరిపాలన కొనసాగించాలన్నారు.తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరగా పూర్తి చేయాలని కోరారు.పెండింగ్ లో ఉన్న ఎస్ ఎల్ బి సి,చర్లగూడెం రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేస్తే నల్లగొండ జిల్లా సస్యశ్యామల మవుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ కృషి చేయాలని కమ్యూనిస్టుల త్యాగాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి,సహాయ కార్యదర్శి బూడిద సురేష్, మండల పార్టీ నాయకులు నిరంజన్, రఘుమయ్య గిరి, బాలకిషన్, కొమరయ్య, నరసింహ లపంగి రవి, బాలకిషన్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే అభిమాని

నవతెలంగాణ-నూతనకల్

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేలు భారీ మెజార్టీతో గెలిస్తే అయ్యప్ప స్వామి దగ్గర మొక్కు తీరుస్తానని స్వామికి మొక్కిన కాంగ్రెస్ నాయకులు సామేల్ అభిమాని పాల్వాయి నాగరాజు శబరిలో మొక్కు తీర్చుకొని శుక్రవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాస లో అయ్యప్ప ప్రసాదం,పుష్పగుచ్ఛం అందజేసినట్టు తెలిపారు.అయ్యప్ప ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజల అభిమానాన్ని ఎమ్మెల్యే పొందాలని కోరారు.



రావి నారాయణరెడ్డి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని పాదయాత్ర

నవతెలంగాణ-భువనగిరిరూరల్



రావి నారాయణరెడ్డి జీవిత విశేషాలు, గొప్పదనం భవిష్యత్ తరాలకు తెలియజేయాలని, ఆయన కంస విగ్రహాలు బొల్లెపల్లిలో, భువనగిరిలో, హైదరాబాదులో నెలకొల్పాలని కోరుతూ శనివారం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సంబంధిత కరపత్రాన్ని ప్రముఖ కవి, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సుసంపన్న భూస్వామ్య కుటుంబ జీవితాన్ని తృణ ప్రాయంగా వదులు కొని ఇరవై యేట నుండే ప్రజా సేవ జీవన విధానంపై ప్రజలకు చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. .ఈ పాదయాత్రను ముఖ్య సలహా దారులు శ్రీ భువనగిరి సత్యనారాయణ, బొల్లేపల్లి హైస్కూలు మొట్ట మొదటి బ్యాచ్ విద్యార్థులు కోడెం లక్ష్మి నారాయణ, బింగి క్రిష్ణ స్వామి, కొణతం రామిరెడ్డి, బాల్ రెడ్డి చేత కరపత్రం ఆవిష్కరణ. పాదయాత్రను నారాయణరెడ్డి మనవరాలు రావి ప్రతిభ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అపరిష్కృతంగా ఉన్న మండల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-గుండాల

మండల పరిధిలో కొన్నెండ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే చొరవచూపి కృషి చెయ్యాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు.శుక్రవారం మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశం మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూరు,ఆత్మకూరు (యం),అడ్డగూడూర్ మూడు మండలాలకు సాగునీరందించే బునాది గానీ కాల్వ పనులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు..మోత్కూరు మండలాన్ని రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న పీహెచ్ సీని వంద పడకల ఆసుపత్రిగా మార్చి,పోస్ట్ మార్టం సౌకర్యం కల్పించాలని,ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు మెతుకు సాయిలు,ఎల్లారెడ్డి,కొంపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ-చింతలపాలెం

మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ జగదీష్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొత్తమద్ది వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారన్నారు. మండల స్థాయిలో గల సుమారు 15విభాగాలకు సంబంధించిన అధికారులు ఈ సమావేశానికి హాజరు కావడం జరిగిందని, ముఖ్యంగా మిషన్ భగీరథ ఎలక్ట్రిసిటీ విభాగాలపై సభ్యులు వారి యొక్క సందేహాలను నివృత్తి చేశారు.మండలంలో రెండు సెక్టార్లకు గాను దొండపాడు, కొత్తగూడెం, ఎర్రగుంట తండా గ్రామాలలో పాక్షికంగా నీటి సరఫరా కావడం లేదని, పైపులైన్ లీకేజీల కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని సంబంధిత శాఖ అధికారులు వివరణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పెద్దగుట్టపై బ్లాస్టింగ్ క్రషర్ నిర్వహణపై అధికారుల విచారణ

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎస్

మండలకేంద్రంలో నిర్వహిస్తున్న కేఎస్ఎన్ఎల్ పెద్దగుట్ట బ్లాస్టింగ్‌పై గ్రామస్తులు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు శాఖల అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు.అనుమతులు లేకుండా క్రషర్ నిర్వహణ చేపడుతున్నారని పెద్దపెద్ద బ్లాస్టింగులు పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బోర్లు పూడిపోతున్నాయంటూ ఇప్పటికే పలుమార్లు రైతులు గ్రామస్తులు వివిధ శాఖల అధికారులతో పాటు నాయకులకు ఫిర్యాదు చేశారు. కాగా కేవలం మండల కేంద్రానికి వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మైనింగ్ శాఖ రెవెన్యూ శాఖ అధికారులు పెద్దగుట్ట పరిసరాలను పరిశీలించి కొంత రైతులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు.అదేవిధంగా క్రెషర్ నిర్వహణ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఉన్నదని ఫిర్యాదులు రావడంతో అక్కడ పరిశీలించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల రైతుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.మైనింగ్ ఏడీ వెంకటరమణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి గుట్ట సర్వేనెంబర్ తప్పుగా నమోదైనట్లు విచారణ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్సై కట్ట వెంకటరెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కాకి కృపాకర్‌రెడ్డి, పందిరి రామ్‌రెడ్డి, మాధవరెడ్డి, గిలకత్తుల ఎల్లయ్య ,శ్రీను, అబ్బగాని భిక్షం, యాదాకుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నూతన మండల కమిటీలు ఎన్నిక

నవతెలంగాణ-చింతలపాలెం

మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ (మహాజన సోషలిస్ట్ పార్టీ) సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలను ఎన్నుకున్నట్టు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అమరారపు నాగేశ్వర్‌రావు అన్నారు.కార్యక్రమానికి హుజూర్నగర్ నియోజకవర్గ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కొండపల్లి ఆంజనేయులు సభా అధ్యక్షత నిర్వహించారు.ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఇన్‌చార్జి తుగంటి అంజయ్యమాదిగ మాట్లాడారు. వర్కింగ్ ప్రెసిడెంట్ బోరబోతుల సురేష్, అధికార ప్రతినిధి కణితి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి బండారు కొండలు ఉపాధ్యక్షులు చింతిరాల రామారావు, ఎంఎస్పీ (మహాజన సోషలిస్ట్ పార్టీ) మండల అధ్యక్షుడు రుద్రపంగు రమేష్, అధికార ప్రతినిధి చిలక యేసు, ప్రధాన కార్యదర్శి పెద్దపంగు శ్రీను, ఉపాధ్యక్షులుగా నన్నెపంగు శేఖర్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చింతిరాలబాలచంద్రుడు, బచ్చలికూరి ప్రసాద్, కొమ్ము రామయ్య, దోసపాటి ప్రభాకర్, చింతిరాల ప్రేమ్‌కుమార్, దేవపంగు ఆరోన్, చిలక నాగేశ్వరరావు, దాసరి దావీదు, మాదాసు గోపి, బండారు వీరబాబు, చింతిరాల రాజు తదితరులు పాల్గొన్నారు.


సైబర్‌నేరాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ కోదాడరూరల్

మండల పరిధిలోని నెమలిగురి గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా,డ్రగ్స్ మత్తు మందులు, గంజాయి నిషేధంపై అవగాహనా కార్యక్రమాన్ని రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మేక నాగేశ్వరరావు, డీఎస్పీ ప్రకాష్ , రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశం, హెడ్‌కానిస్టేబుల్ సమ్మద్, కానిస్టేబుల్ సురేష్,నరేష్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవుల్లో అవకాశమివ్వండి

నవతెలంగాణ-సూర్యాపేట



40 ఏండ్ల నుండి కాంగ్రెస్‌కు పలు రకాలుగా సేవలు అందిస్తున్న తనకు కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని ఓబీసీ సెల్ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు.ప్రధానంగా తన కుటుంబ మొత్తం పదవులు రాకపోయినా పార్టీ కోసం పనిచేయడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా తన తండ్రి జీవితం మొత్తం కూడా పార్టీ కోసమే త్యాగం చేశారని పేర్కొన్నారు.పార్టీ కోసం తన కుటుంబంతో పాటు తన సేవలను గుర్తించి నామినేటెడ్ లేక కార్పొరేషన్‌లలో తనకు అవకాశం కల్పించాలని కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-చివ్వెంల



సంక్రాంతి పండుగ సందర్భంగా చైతన్య యువజన మండలి ఆధ్వర్యంలో చందుపట్ల గ్రామం లో జనవరి 09 వ తేది నుండి మొదలైన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది.ఈ సందర్భంగా చందుపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ అడ్వకేట్ పొదిల ప్రదీప్,చైతన్య యువజన మండలి గౌరవ అధ్యక్షులు అనంతుల మధు మాట్లాడారు.చైతన్య యువజన మండలి సభ్యులు దాతలను శాలువాలతో సత్కరించారు.ప్రథమ బహుమతి అక్కదేవిగూడెం,ద్వితీయ బహుమతి, చందుపట్ల,తృతీయ బహుమతి సూర్యాపేట,చతుర్థి బహుమతి నర్సింహులగూడెం,పంచమి బహుమతి దాచారం బహుమతులు గెలుచుకున్నాయి.ఈ కార్యక్రమం లో చైతన్య యువజన మండలి గౌరవ సలహా దారుడు ఎస్ కె . రహమాత్ పాషా, అధ్యక్షులు భాషిపంగు సునీల్, కార్యదర్శి కొలికపంగు వాసు తదితరులు పాల్గొన్నారు.

చిక్కుల రమేష్‌కు నివాళులర్పించిన జడ్జ్

నవతెలంగాణ-నార్కట్ పల్లి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జిల్లా కోర్టు అటెండర్ చిక్కుల రమేష్ మృతదేహాన్ని శుక్రవారం మొదటి అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు నల్లగొండ జడ్జ్ తిరుపతి సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.

వేమన జయంతి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల కేంద్రంలోని పివిఆర్ శ్రీచేతన హైస్కూల్ నందు శుక్రవారం వేమన జయంతివేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామూహిక వేమన పద్యాలను పటించారు. ఈ కార్యక్రమంలో వేమన వేషధారణ ధరించినటువంటి విద్యార్థికి, వేమన పద్యాలను నిరాఘటంగా పటించినటువంటి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ పుచ్చకాయల వెంకటరెడ్డి, డైరెక్టర్ పుచ్చకాయల సునీత బహుమతి ప్రధానంచేశారు. ఈ కార్యక్రమంలో పానుగంటి రాఘవేంద్ర, మనోహర, శ్రీనివాస్, సురేష్, వెంకట్, జాస్మిన్, లక్ష్మి, యం మంజుల, వై మంజుల వనజ, శోభ, సన, శిరీష, నాగలక్ష్మి శోభ, రేవతి, హిమ బిందు, కళ్యాణి, టీ మంజుల, చైతన్య, జ్యోతి పాల్గొన్నారు.

వీరేశం అభిమానుల మొక్కులు చెల్లింపు

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం అత్యధిక మెజార్టీతో విజయం సాధించగా వీరేశం అభిమానులు 41 రోజులు దీక్ష చేసి శబరిమల అయ్యప్ప స్వామికి తమ మొక్కులు చెల్లించారు. మొక్కులు చెల్లించిన వారిలో అభిమానులు కుంభం రవిగౌడ్, నారి నరేష్, పుట్ట శంకర్, పందిరి పరుశు రాములు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి: ఎస్ఐ

నవతెలంగాణ-నాగార్జునసాగర్



ఆన్లైన్లో సైబర్ నేరస్తులు పొంచి ఉన్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మొబైల్‌లో వచ్చే ఓటిపి లను ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్ సూచించారు. శుక్రవారం మీడియాకు ప్రెస్ నోట్ విడుదల చేసి మాట్లాడారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా అనగా లైవ్ వీడియోలు, ఫోటోలు, ఉచిత అక్షింతలు, విరాళాలు, ఉచిత మూల విగ్రహ దర్శనము, రైల్ టికెట్లు పేరుతో అనేక రకాలుగా ప్రలోభ పెట్టి ఆన్లైన్ లింకులు (బ్లూ కలర్‌లో కనబడతాయి) పంపుతారని దయచేసి ఎవరు అటువంటి లింకులు లేదా మొబైల్ యాప్‌లో క్లిక్ చేయవద్దని కోరారు. ఫోన్ కాల్ చేసి ఓటీపీ అడిగారంటే అది కచ్చితంగా మిమ్మల్ని మోసం చేయడానికే అని గుర్తించుకోవాలన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో మహిళ సాధికారత కార్యక్రమం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణంలోని సంతోష్ నగర్ లో గల అంగన్వాడి రెండవ సెంటర్లో శుక్రవారం మహిళా సాధికారత కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ దాడి అరుణ గర్భిణీ స్త్రీలకు బాలింతలకు మహిళ సాధికారత గురించి తెలియజేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. బేటీ బచావో బేటీ పడావో నినాదం గురించి, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీ టీచర్ బ్రెయిన్ డెడ్.. ఆదుకోవాలంటూ వేడుకోలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ మండలం జంకుతండ గ్రామ పంచాయతీ పరిధిలోని కాలనీలో అంగన్వాడి టీచర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన విజయశ్రీ బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో చికిత్స కోసం హైదరాబాద్ లోని కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేస్తున్న క్రమంలోనే బ్రెయిన్ డెడ్ అయిందని డాక్టర్లు చెప్పారు.చికిత్స కోసం ప్రతి రోజు లక్షల రూపాయలు ఖర్చు అవుతున్నాయి.పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారింది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసి పేద అంగన్వాడి టీచర్ ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థిక సహాయం చేసే దయ గల పుణ్యాత్ములు ఫోన్ పే నంబర్ 630458 3270 కు సహాయం చేయాలని వేడుకుంటున్నారు. ఎస్ బి ఐ అకౌంట్ నెంబర్-52122707243 సహకారం అందించాలని భర్త శ్రీనివాసరావు కోరుతున్నారు.

శేఖర్ వర్ధంతి

నవతెలంగాణ-దేవరకొండ

ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి శేఖర్ 22వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శేఖర్ స్మారకస్తూపం వద్ద ఏఐఎస్ఎఫ్ దేవరకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ హాజరై స్మారక స్తూపానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ విద్యార్థుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహించిన వీరుడన్నారు. ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నూరిగి వినయ్, బొడ్డుపల్లి అర్జున్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషోద్దీన్, పెనిమెళ్ల శివ, బాలికల కన్వీనర్ బాసవాడ శైలజ, వట్టికోటి శ్రీకాంత్, నాయక్ సిద్ధార్థ,వరికుప్పల ఆంజనేయులు, కంపల్లి భాను, బొడ్డుపల్లి ఆంజనేయులు, మధు, నవీన్, అఖిల, అనూష, పూజ, అంజలి, మాధవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నికలకు ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-నల్లగొండటౌన్

పాఠశాల విద్యా కమిటీ ఎన్ని కలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి శుక్రవారం తెలిపారు ఈనెల 20వ తేదీన నోటీసులు జారీ, పేరెంట్స్ లిస్టు ప్రదర్శన 22న అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా, 29న ఎన్నికల నిర్వహణ, చైర్మన్ వైస్ చైర్మన్ పాఠశాలల అభివృద్ధి, అభ్యసన, నమోదు మొదలైన విషయాలలో నిర్ణయం తీసుకొని పాఠశాల యాజమాన్య కమిటీకి ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఒకటి నుండి 8 తరగతులు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్త విధానం ద్వారా ఈ ఎన్ని కలు నిర్వహిస్తారని, ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యుల చొప్పున అన్ని తరగతులకు ఎన్నిక కాబడిన వారి నుండి ఒకరు చైర్మన్ మరిఒకరిని వైస్ చైర్మన్గా ఎన్నుకుంటారని తెలిపారు. ప్రభుత్వ కేజీబీవీ ,యుఆర్ఎస్, ఆదర్శ పాఠశాలలు, ఎయిడెడ్, అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. 29వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ఎన్నిక, మొదటి సమావేశం నిర్వహించాలని అన్నారు.

మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామంలోగల హనుమాన్ రైస్ఇండస్ట్రీ నుండి విడుదల అవుతున్న వ్యర్ధ జలాలను వాయిళ్ళబాయి కుంటలోకి పంపుతున్న మిల్లు యాజమాన్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్ డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు వాయిల్లబాయి కుంటను పరిశీలించారు. ఈ కుంటలోకి హనుమాన్ రైస్ ఇండస్ట్రీ నుండి వ్యర్ధ జలాలు కుంటలోకి రావడం వల్ల నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, ఈ కలుషిత నీరు తాగిన పశువులు, గొర్రెలు మేకలు అనేక జబ్బులు సోకి మరణిస్తున్నాయని వారు పేర్కొన్నారు. వెంటనే స్థానిక ఎమ్మార్వో, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మిల్లు యాజమాన్యం పైన చర్య తీసుకొని కాలుష్యాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కుంటను సందర్శించిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బోలుగూరి లింగయ్య, సీనియర్ నాయకులు దేశగాని బాలరాజు, మేకల బిక్షం, రావుల చిన్న వెంకన్న, సత్తయ్య, పి దేవేందర్ తదితరులు ఉన్నారు.

దేవరకొండ డివిజన్ ఎంఈఎఫ్ అధ్యక్షులుగా భాస్కర్

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ డివిజన్ మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులుగా పులికంటి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వస్కుల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐబీలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పులికంటి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రావులపల్లి బాలరాజును ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులు ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు మరియు కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి మాదిగలకు సత్వరమే న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ముడి అంజయ్య, సీనియర్ నాయకులు పొట్ట రాములు, నల్ల నర్సింహ , గాదెపాకు జగదీష్ , మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

తన ఆటపాటల ద్వారా అనేక మందిని చైతన్యంచేసి జీవితాంతం బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రముఖ కవి గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని చిట్యాల మండలం పెద్దకాపర్తికి గ్రామానికి చెందిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మాజీ జాతీయ కార్యదర్శి చేకూరి గణేష్ డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక ఉద్యమాలు చేసి, జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ వారి క్యాలెండర్‌ను చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి శుక్రవారం తననివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎళ్ల బయ్యన్న, సహాయ కార్యదర్శి ముప్పు సుఖేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఆవుల ఆనంద్, ప్రధాన కార్యదర్శి కూరకుల సుధీర్, కోశాధికారి నల్ల నర్సిరెడ్డి, దేవనబోయిన సైదులు, మెండే నర్సింహ, నూనె యాదగిరి, కన్నెబోయిన నరేందర్‌యాదవ్, గుండాల లింగస్వామి, చిర్రబోయిన రవి, భయ్యా రవి, గంజి వేణు, చాపల సతీష్, మూడుదుడ్ల శ్రీకాంత్, శ్రీధర్, చిర్రబోయిన రమేష్, పంగరెక్క ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బీఎల్ఓలు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-మర్రిగూడ

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటు నమోదు చేసుకోవడానికి జనవరి 22 చివరి తేదీ కావటంతో మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) గ్రామాలలో అందుబాటులో ఉండి ఓటు నమోదు పై అవగాహన కల్పించాలని శుక్రవారం తాసిల్దార్ బక్క శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఓటు నమోదు ప్రక్రియలో బీఎల్ఓ పాత్ర కీలకమని దీనిని బాధ్యతాయుతంగా తీసుకొని విజయవంతం చేయాలని కోరారు.

1.25 కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-చివ్వెంల

అక్రమంగా రవాణా చేస్తున్న 1.25 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని బీబీగూడెంలో సమీపంలో చోటుచేసుకుంది.ఎస్సై విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం..నందిగామ డేవిడ్ సూర్య, బొంత అవినాష్ ఏపీలోని అరకులో 1.25కిలోల గంజాయిని కొనుగోలుచేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు లారీలో వెళ్తున్నారు.ఈక్రమంలో మండలంలోని బీబీగూడెం దాటిన తర్వాత పెట్రోల్‌బంక్ లో పోలీసులు తనిఖీ చేస్తుండగా లారీ ఆపి వారు పరారవుతుండగా సూర్యను పట్టుకున్నారు.కాగా బొంత అవినాష్ పరారయ్యాడు.గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.సూర్యను పరిశోధనాధికారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యాపేటరూరల్ అశోక్ రెడ్డి నిందితున్ని రిమాండ్‌కు పంపించారు.



టీఎస్‌యుటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-చింతపల్లి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీటీనగర్ నందు ప్రధానోపాధ్యాయురాలు మరియు మండల నోడల్ ఆఫీసర్ అడపాల వాణి గారిచే ఆవిష్కరణ చేయనైనది ఇట్టి కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు జింక సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి నేరేడు గొమ్ము ఏడుకొండలు మండల ఉపాధ్యక్షులు దొడ్డి నరసింహ సంపత్ స్వరాజ్యలక్ష్మి చిలుక గోపాల్ సుధీర్ కుమార్ స్వరూప రాణి మంజుల రవికుమార్ వెంకటయ్య ఇంద్ర శేఖర్ రెడ్డి మోతిలాల్ రుక్మిణి మేడం శ్రీవిద్య సుజాత అన్వర్ బాల్‌రెడ్డి కిరణ్ కుమార్ కృష్ణవేణి శ్రీదేవి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట తండాలో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-దామచర్ల

దామచర్ల మండలంలోని కొత్తపేట తండాలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్ర పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 46 గేదెలకు సమస్యను గుర్తించి వైద్యం అందించారు. 24 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతి, ఉపసర్పంచ్ జ్యోతి నాగు మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వప్న, సూపర్ వైజర్ సిబ్బంది శివారెడ్డి ,సైదులు గోపామిత్రలు బాలాజీ, ప్రభాకర్, బిక్షా నాయక్ , అశోక్ రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఓటు నమోదు పత్రాన్ని అందజేసిన దైదరవీందర్

నవతెలంగాణ-నకిరేకల్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాన్ని తహసీల్దార్ ప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ స్వయంగా అందజేశారు.